www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -77 బుధవారం 1 జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




# పదవి శాశ్వతం కాదు

ఎన్టీఆర్, ఇందిర లాంటి వారే ఓడారు

పదవి శాశ్వతం అని నేను కూడా భావించడం లేదు

ఇచ్చిన హామీ మేరకు మంచి పనులు చేయడమే నా లక్ష్యం

రాష్ట్రాన్ని అప్పుల బారి నుంచి గాడిన పెడుతున్నాం

రైతులను రుణమాఫీ, రైతు భరోసాతో ఆదుకుంటున్నాం

బకాసురుడు కెసిఆర్ చేసిన అప్పులు తీర్చలేక చస్తున్నాం

కెసిఆర్ హాయంలో జీతాలు కూడా సక్కగ ఇవ్వలేదు

కన్నకూతరు ఫోన్లు క ఊడా ట్యాప్ చేసిన ఘనుడు

మళ్ళీ వస్తే ఫోన్ ట్యాపింగ్ తప్ప మరేమీ ఉండదు

రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చే ఛాన్స్ లేదు

**శిల్పకళావేదిక రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,జూన్ 30(ప్రజావినికిడి):** పదవి ఎవరికీ శాశ్వతం కాదని, కేవలం ఇచ్చిన మాటే శాశ్వతంగా ఉంటుందని.. నాడు ఇందిరమ్మ, ఎన్టీఆర్ లాంటి మహానాయకులే ఓడిపోయారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. నాకు కూడా అంతేనని, పదవి శాశ్వతంగా ఉంటుందని నేను కూడా భావించడం లేదన్నారు. అయితే ఉన్నన్ని నాళ్లు మంచి పనులు చేసి, మంచివాడనిపించుకోవడమే ముఖ్యమని అన్నారు. నేను అబద్దాలు చెప్పను,**మిగతాది 2లో...**

## దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

మనం అభివృద్ధి చెందడమే కాదు.. -వెనక ఉన్నవారిని ముందుకు తీసుకెళ్లాలి

గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**విశాఖపట్నం,జూన్ 30(ప్రజావినికిడి):** దేశ నిర్మాణంలో విద్యావంతులైన యువతదే అత్యంత కీలక భూమిక అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు.**మిగతాది 2లో...**

## జీతభత్యాల వివరాలు అందించండి..

కేంద్ర శాఖలకు 8వ పే కమిషన్ డెడ్‌లైన్

8వ వేతన సంఘం ప్రక్రియలో కీలక ముందడుగు


ఉద్యోగుల జీతభత్యాల వ్యయ వివరాలను కోరిన కమిషన్

జూన్ 30 లోగా ఆన్‌లైన్‌లోనే డేటా సమర్పించాలని ఆదేశం

గత మూడేళ్ల ఆర్థిక సంవత్సరాల పూర్తి వివరాలు తప్పనిసరి

సిఫార్సుల రూపకల్పనలో ఈ సమాచారం అత్యంత కీలకం

**ముంబయి,జూన్ 30(జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి 8వ వేతన సంఘంతన కార్యకలాపాలను కీలక దశకు చేర్చింది. ఉద్యోగుల జీతాలు, అలవెన్సులపై సిఫార్సులు చేసేందుకు ముందుగా.. ప్రభుత్వం ప్రస్తుతం ఎంత ఖర్చు చేస్తోందో స్పష్టమైన అంచనాకు రావాలని కమిషన్ భావిస్తోంది. ఇందులో భాగంగా అన్ని **మిగతాది 2లో...**



## మహా సిఎం ఫడ్నవీస్‌తో పవన్ కల్యాణ్ భేటీ

తూర్పు కనుమలలో పులుల సంరక్షణపై చర్చ

రెండు ఆడపులులలను ఇచ్చేందుకు సిఎం అంగీకారం



**ముంబయి,జూన్ 30(ప్రజావినికిడి):** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై నేతలు చర్చించారు. ముంబయిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై చర్చలు సాగాయి. ఉమ్మడి ప్రయోజనాలకు**మిగతాది 2లో...**

## తెలంగాణలో సర్వర్లు డౌన్!

భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి..

స్తంభించిన స్లాట్ బుకింగ్, చలాన్, ఈ-కేవైసీ సేవలు

కార్యాలయాల వద్ద ప్రజలు పడిగాపులు

మూడు నెలల్లో ఇది నాలుగోసారి

సర్వర్ల పునరుద్ధరణకు సాంకేతిక బృందం కసరత్తు

**హైదరాబాద్,జూన్ 30(ప్రజావినికిడి):** తెలంగాణ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించిపోయాయి. సాంకేతిక లోపాలతో ప్రధాన సర్వర్లు గత**మిగతాది 2లో...**




## సిఎం రేవంత్‌తో సునీల్ మిట్టల్ భేటీ

సమగ్ర డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

**హైదరాబాద్,జూన్ 30(ప్రజావినికిడి):** ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధీ పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్ మర్యాద పూర్వకంగా కలిసారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విద్యలో తీసుకువస్తున్న సంస్కరణలను మిట్టల్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి **2లో...**



## దిల్లీ కాంగ్రెస్ కు ఏటీఎంగా తెలంగాణ

బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శ




**హైదరాబాద్,జూన్ 30(ప్రజావినికిడి):** కాంగ్రెస్ దిల్లీ దర్బార్‌కు తెలంగాణను ఏటీఎంగా మార్చారని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో జరిగిన భాజపా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడారు. మోదీ నేతృత్వంలో భాజపా వెంట నడిచేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. భాజపాను గెలిపించిన రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. దేశంలో 12 ఏళ్లలో చాలా పరివర్తన వచ్చింది.**మిగతాది 2లో...**

# ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్‌కు దిశానిర్దేశం

గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానం

వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలో ప్రారంభం...

కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్

అత్యాధునిక యుద్ధ విమానాల్లో 'మేడ్ ఇన్ తెలంగాణ'

మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,జూన్ 30(ప్రజావినికిడి):** ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్-2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ / డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, 'ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణెళి కొత్త **మిగతాది 2లో...**



# ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

**(మొదటి పేజీ తరువాయి)**

చిరునామా' అని స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో ్గ ÷టైర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు.

'ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా అందిస్తున్నాయి' అని చెప్పారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్?16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్‌ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది' అని పేర్కొన్నారు. స్పెయిన్, కెనడాలకు చెందిన అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో




పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు.

ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్‌ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు. డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గత ఏడాది ఎగుమతులు 103 శాతం పెరిగి, రాష్ట్రానికి ఎన్నో దశాబ్దాలుగా అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. ÷ూష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు.

# దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. 'నేను కూడా ఒక మారుమూల గ్రామం నుంచి వచ్చిన మొదటి గ్రాడ్యుయేట్‌ను. ఈరోజు ఇంతమంది యువతీయువకులకు పట్టాలు అందించడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోందని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో సమాజంలో ఇంకా వెనుకబడి ఉన్న అట్టడుగు వర్గాలను మరవకూడదని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. 'మీరు జీవితంలో ముందుకు వెళ్లడమే కాదు.. ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఎందరో పేదలు, అట్టడుగు వర్గాల వారు కనిపిస్తారు. వారిని ప్రోత్సహించడంలో మీ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్య



సాధన దిశగా యువత పాత్ర ఎంతో కీలకమని, దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహానుభావుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని ఆకాంక్షించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ కల సాకారం అవుతుందన్నారు. స్వయంకృషితో రాష్ట్రపతిగా ఎదిగిన వ్యక్తి ద్రౌపది ముర్ము అని కొనియాడారు. విద్యార్థులను భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా13 మందికి రాష్ట్రపతి బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మంత్రి సంధ్యారాణి, ట్రైబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, వీసీ పాల్గొన్నారు.

# జీతభత్యాల వివరాలు అందించండి..

**(మొదటి పేజీ తరువాయి)**

ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించిన పూర్తి వివరాలను కమిషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆన్‌లైన్ డేటా పోర్టల్‌లో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ఈ సమాచారాన్ని అప్‌లోడ్ చేయడానికి జూన్ 30 తుది గడువుగా నిర్ణయించినట్లు 8వ పే కమిషన్ అప్‌డేట్స్‌ను పంచుకునే ఒక పోర్టల్ పేర్కొంది. ఈ ప్రక్రియలో వందలాది ప్రభుత్వ కార్యాలయాలు, భారీ ఆర్థిక డేటా ఇమిడి ఉన్నందున, అన్ని సంస్థలు గడువులోగా ఈ పని పూర్తి చేస్తాయా? లేదా? కమిషన్ మరింత సమయం ఇస్తుందా అనేది వేచి

సమాచారమంతా తప్పనిసరిగా తమ అధికారిక ఆన్‌లైన్ డేటా పోర్టల్ ద్వారానే సమర్పించాలని కమిషన్ స్పష్టం చేసింది. ఆఫ్‌లైన్ పద్ధతిలో ఎలాంటి వివరాలను స్వీకరించబోమని స్పష్టం చేసింది. అంటే.. మంత్రిత్వ శాఖలు భౌతిక ఫైళ్లు, ఎక్సెల్ షీట్లు, ప్రింటెడ్ డాక్యుమెంట్లు లేదా ఈ-మెయిల్ ద్వారా సమాచారాన్ని పంపడానికి వీల్లేదు. కేవలం ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన డేటాను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. సిఫార్సుల రూపకల్పన కోసం ఒకే డిజిటల్ డేటాబేస్‌ను రూపొందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

నివేదికల ప్రకారం.. గత మూడు పూర్తి ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన వ్యయ వివరాలను అందించాలని కమిషన్ కోరింది. 2022-23, 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలలో ఉద్యోగుల జీతభత్యాలపై అయిన ఖర్చు వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. పే మ్యాట్రిక్స్ లెవల్ 1 నుంచి లెవల్ 18 వరకు అన్ని స్థాయిలలో జీతాలు, వివిధ రకాల అలవెన్సులపై ఎంత ఖర్చు చేశారో విడివిడిగా చూపించాలి.

కేవలం మూల వేతనం ( మాత్రమే కాకుండా ప్రతి అంశానికి సంబంధించిన పూర్తి వ్యయ వివరాలను కమిషన్ కోరింది. ఇందులో బేసిక్ పే, మిలిటరీ సర్వీస్ పే, కరవు భత్యం (డీఏ), ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ), రవాణా భత్యం (టీపీటీఏ), రిస్క్ అండ్ హార్డ్‌షిప్ అలవెన్స్, రైల్వే ఉద్యోగులకు రన్నింగ్ స్టాఫ్ అలవెన్సులు, నాన్-ప్రాక్టీసింగ్ అలవెన్స్ (ఎన్‌పీఏ) వంటి అన్ని వివరాలు ఉండాలి. వీటికి తోడు ఉద్యోగులకు చెల్లించే ఇతర అలవెన్సుల వివరాలను కూడా పొందుపరచాలి. ప్రతి ఆర్థిక సంవత్సరంలో అలవెన్సులపై అయిన మొత్తం ఖర్చును కూడా నివేదించాల్సి ఉంటుంది.

వేతన సంఘం తన సిఫార్సుల రూపకల్పనకు ముందు చేపట్టే అతి ముఖ్యమైన చర్యలలో ఈ డేటా సేకరణ ఒకటి. ప్రస్తుతం వివిధ పే లెవల్స్‌లో జీతభత్యాలపై ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుందో అధ్యయనం చేయడం ద్వారా, భవిష్యత్తులో చేసే సవరణల వల్ల ప్రభుత్వ ఖజానాపై పడే ఆర్థిక ప్రభావాన్ని కమిషన్ కచ్చితంగా అంచనా వేయగలదు. సవరించిన పే స్కేల్స్, అలవెన్సులు, ప్రభుత్వ మొత్తం వ్యయం, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలపై పటిష్టమైన సిఫార్సులు చేయడానికి ఈ సమాచారం దోహదపడుతుంది. ఈ డేటా సేకరణ పూర్తయ్యాక, కమిషన్ గణాంకాలను విశ్లేషించి, నివేదిక రూపకల్పనలో తదుపరి దశకు వెళ్లే అవకాశం ఉంది.

# దిల్లీ కాంగ్రెస్ కు ఏటీఎంగా తెలంగాణ

**(మొదటి పేజీ తరువాయి)**



కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పశ్చిమబెంగాల్‌లో ఎలా గెలిచారని చాలా మంది నన్ను అడుగుతున్నారు. భాజపా కార్యకర్తల కష్టాలతో పశ్చిమబెంగాల్‌లో గెలిచామని చెప్పాను. అక్కడ పార్టీ కార్యకర్తలను చాలా ఇబ్బందులకు గురిచేశారు. అయినా, లెక్కచేయకుండా భాజపాని గెలిపించాలనే ఆలోచనతో వారు పనిచేశారు. సర్‌పై ప్రజలకు భాజపా కార్యకర్తలు అవగాహన కల్పించాలి. తెలంగాణలో సర్‌పై ప్రజలు సంతోషంగా ఉన్నారు. తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారు. ఇక్కడి నుంచి దిల్లీకి డబ్బులు వెళ్తున్నాయి. దిల్లీ దర్బార్‌కు తెలంగాణ ఏటీఎంగా మార్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చింది.. కానీ, ఒక్కటికూడా పూర్తి చేయలేదు. కాంగ్రెస్.. అవినీతి, నేరాల తరహా పాలన చేస్తున్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్‌ఎస్ కలిసే ఉన్నాయి. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని నితిన్ నబీన్ ఆరోపించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

# సిఎం రేవంత్‌తో సునీల్ మిట్టల్ భేటీ

**(మొదటి పేజీ తరువాయి)**

వివరించారు. ప్రభుత్వ పాఠశాలను పూర్తి గా ప్రక్షాళన చేస్తున్నట్లు వివరించారు. నిరుద్యోగుల్లో నైపుణ్యాలను పెంపోందించడానికి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐటీఐలను ఏటీసీ లుగా మారుస్తున్నామని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలను అభివృద్ధి చేస్తున్నాం.. చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్ మరియు ఎఐ మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచన చేశారు. హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ , ఎఐకార్యకలాపాలపైన దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్ పెట్టుబడి అవకాశాలు, సమస్యలను పరిష్కరించడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేలా ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నామినేట్ చేసి సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్ లు అందజేస్తామని సునీల్ మిట్టల్ తెలిపారు. ఎయిర్ టెల్ కు రెండో హెడ్ క్వార్టర్ లా హైదరాబాద్ ను చూస్తున్నామని మిట్టల్ అన్నారు. డేటా సెంటర్ల కెపాసిటీని మరింత పెంచడానికి ముందుకు వస్తామని హామీ ఇచ్చారు. ఫైబర్ కనెక్టివిటీ మరింత పెంచడంపైన ఆసక్తి చూపించిన సునీల్ మిట్టల్.

# మహా సిఎం ఫడ్నవీస్‌తో పవన్ కల్యాణ్ భేటీ

**(మొదటి పేజీ తరువాయి)**

సంబంధించి భవిష్యత్తులో మరింత సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు తలెత్తాయన్నారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని.. ఈ సహకారానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. తూర్పు కనుమలలో పులుల

సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఏపీలోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడపులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు వచ్చాయని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆంధప్రదేశ్‌కు రెండు ఆడపులులను ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు.

---------------

# తెలంగాణలో సర్వర్లు డౌన్!

**(మొదటి పేజీ తరువాయి)**

రెండు రోజులుగా పనిచేయడంలేదని తెలుస్తోంది. భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సర్వర్లు పనిచేయకపోవడంతో కొత్త స్లాట్ బుకింగ్‌లు, చలాన్ చెల్లింపులు, ఈ-కేవైసీ వంటి ఆన్‌లైన్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ముందుగానే ముహూర్తాలు చూసుకుని స్లాట్‌లు బుక్ చేసుకున్న క్రయ, విక్రయదారులు సాక్షులతో కలిసి కార్యాలయాలకు చేరుకున్నా, గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.గత మూడు నెలల్లో సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. తరచూ ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సాంకేతిక లోపం ఎక్కడ తలెత్తిందనే విషయంపై క్షేత్రస్థాయి అధికారులకు కూడా సమాచారం లేదు. వారు ప్రజలకు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. దీంతో కార్యాలయాల వద్ద గందరగోళం నెలకొంది. సాఫ్ట్‌వేర్‌లో ఏర్పడిన సమస్యను గుర్తించి సర్వర్లను పునరుద్ధరించేందుకు రాష్ట్ర స్థాయి సాంకేతిక బృందం చర్యలు చేపట్టిందని ఉన్నతాధికారులు తెలిపారు. సేవలు ఎప్పటికి పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తారనే విషయంపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

# పదవి శాశ్వతం కాదు

**(మొదటి పేజీ తరువాయి)**

చెప్పింది చేసి తీరుతా. ప్రజలకు నచ్చకపోయినా ఉన్నది ఉన్నట్లే చెప్తాను అని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజలది, రైతులది, ఆడబిడ్డలది అని భరోసా ఇచ్చారు. కేసీఆర్ లాంటి తప్పుడు పనులు తాను ఎప్పటికీ చేయనని చెప్తూ.. ఆ పశుపతిని (కేసీఆర్‌ను) నీ ఫార్మ్‌హౌస్‌లోనే బంధించాను, ఇక బయటకు రానిచ్చే ప్రసక్తే లేదు' అని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. శిల్పకళావేదిక వేదికగా జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పాలకుల తీరును ఎండగడుతూ పదునైన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు బకాసురుడిని తీసుకెళ్లి ఫార్మ్‌హౌస్‌లో కూర్చోబెట్టారని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆయన అన్నీ మీకే చేశాడని, మళ్లీ అధికారంలోకి రావాలని అంటున్నాడు. అసలు మనకేం చేశాడు? మళ్లీ ఎందుకు వస్తాడు అని సీఎం ప్రశ్నించారు. గత పదేళ్లలో అగ్రికల్చర్, హార్టికల్చర్‌లను పూర్తిగా పక్కనపెట్టేసి, రాష్ట్రంలో 'డ్రింకింగ్ కల్చర్' తీసుకువచ్చారని మండిపడ్డారు. బకాసు9రుడు చేసిన అప్పులను మేము తీరుస్తున్నామని అన్నారు. మళ్లోసారి కేసీఆర్ వస్తే భార్యాభర్తల మాటలను వినడం తప్ప చేసేదేమీ లేదన్నారు. కన్న బిడ్డ కవిత, అల్లుడు మాట్లాడుకున్న మాటలు విన్నారని ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ ఘాటు విమర్శలు చేశారు.

30 నెలల్లో రైతు సంక్షేమం కోసం అనేక పనులు చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. 19 మంది ముఖ్యమంత్రులు రాష్ట్రానికి రూ.69 వేల కోట్లు అప్పు



చేశారని, 2014 నాడు రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రానికి రూ.69 వేల కోట్లే అప్పు ఉందని సీఎం గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పు అయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేవలం కల్వకుంట్ల కుటుంబం ఏడు లక్షల కోట్లకు పైగా అప్పు చేసిందని సీఎం చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన టైంలో మిగులు బడ్జెట్ ఉండేదని, రాష్ట్రం కోలుకోకుండా కేసీఆర్ అప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. అప్పులు కాదు.. అందిన కాడ చేబదులు కేసీఆర్ తీసుకొచ్చారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ఉద్యోగులకు జీతాలు వాయిదాల్లో

ఇచ్చారని బీఆర్‌ఎస్ పాలనను సీఎం రేవంత్ దుయ్యబట్టారు. ధనిక రాష్ట్రంలో జీతాలు ఇవ్వలేని స్థితికి కేసీఆర్ తీసుకెళ్లారని సీఎం రేవంత్ విమర్శించారు. కాంట్రాక్టర్లు, సర్పంచులకు బకాయిలను కేసీఆర్ ఇవ్వలేదని, కేసీఆర్ సర్కార్ వల్లే మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని సీఎం ఆరోపించారు. బకాయిలు బకాసురుడు పెడితే.. కట్టే పాపం తనపై పడిందని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. స్కూల్లోని పిల్లలకు మిడ్ డే మీల్స్ పెట్టేవాళ్లకు బకాయిలు పెట్టారని.. బీఆర్‌ఎస్ సర్కార్ అప్పులే కాదు.. తప్పులు కూడా చేసిందని సీఎం విమర్శించారు. దేశంలో ఎక్కడికి పోయినా ఇజ్జత్ పోయేలా కేసీఆర్ చేశారని, చంద్రశేఖర్ దెబ్బకు రాష్ట్రంలోని ప్రజలంతా బికారులయ్యామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తవ్వుతున్న కొద్దీ.. గుట్టల కొద్దీ అప్పులు బయటపడ్డాయని.. బీఆర్‌ఎస్ హయాంలో కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇదే వేదికపై నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై కూడా రేవంత్ రెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. దేశంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోదీ, ఆ ఉద్యోగాలు ఎవరికిచ్చారని నిలదీశారు. ఇక్కడ ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయని, వారు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అని ఎద్దేవా చేశారు. 'అక్కడ పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కాబట్టి మీ పప్పులు ఉడికాయి. బెంగాల్‌లో గెలవడానికి మీకు 15 ఏళ్లు పట్టింది. కానీ ఇక్కడికి మీరా వచ్చేది? ఇక్కడ మావాళ్లు ఉన్నారు, దంచి కొడతారు' అంటూ తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. 'దిగిపోవడానికి ఇది నీ అయ్యా జాగీరా? మేము మీకేం బానిసలం కాదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు రైతులను వరి వేసుకుంటే ఉరే అన్న కేసీఆర్, ఆయన మాత్రం ఫార్మ్‌హౌస్‌లో వడ్లు పండించి ఏకంగా 4200 క్వింటాళ్లు అమ్ముకున్నాడని ఆరోపించారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలినా.. ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. బోరు కింద పంటలు పండినా కాళేశ్వరం మహిమ అంటూ ప్రజలను మోసం చేశారని చెప్పారు. కేసీఆర్ ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారా? దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా? ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారు? పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? ఊరూరికి బెల్ట్ షాప్ తెచ్చి తాగుడు కల్చర్ నేర్పించారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే చేసేదేమీ ఉండదు. వరి వేస్తే ఉరే అని బెదిరించి రైతుల పంటను కొనలేదు. పేదల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ అన్నారు.. వేశారా?ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఆయన చెప్పారు.. ఇచ్చారా? అని ప్రశ్నించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చాం. మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తున్నామని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. మహిళలతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయించి యజమానులుగా



చేశాం. రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం అన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి తక్కువ వర్షాలు పడ్డాయి. రైతుల వరిసాగు తగ్గించి మెట్ట పంటలు వేసుకోవాలి. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అనుకునేలా చేస్తున్నాం. 9 రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9వేల కోట్లు వేస్తాం. ఒక్కో సమస్యను చక్కబెట్టుకుంటూ సంక్షేమం కొనసాగిస్తున్నాం. సాగు పనులు మొదలయ్యే నాటికే రైతుభరోసా అందిస్తున్నాం. 2023లో సీఎస్ వంటి ఐఏఎస్ అధికారులకే 1న జీతాలు ఇవ్వలేని పరిస్థితి. కొన్నేళ్లుగా వాయిదాల పద్ధతిలో వస్తున్నాయని అధికారులు చెప్పారు. బడి పిల్లల తిండి బిల్లులు కూడా రూ.వేల కోట్ల బకాయిలు పెట్టారు. సర్పంచ్‌ల బిల్లులు రూ.వేలకోట్లు పెండింగ్ పెడితే.. వారు ఇప్పుడు ధర్నాలు చేశారు. బిల్లులు పెండింగ్ పెట్టింది కేసీఆర్.. ఆ బద్నాం మోసింది నేను. కేసీఆర్ చేసిన అప్పులతో దిల్లీలో కూడా పరువు పోయే పరిస్థితి వచ్చింది' అని రేవంత్ అన్నారు.

--------------------

# ఘనంగా కొనసాగుతున్న శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలు

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** మంగళవారం నుండి 5 జులై ఆదివారం వరకుశ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తుల విశేష సహకారంతో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాలను విజయవంతం చేయడానికి విశేషంగా సహకారం అందిస్తున్న ధర్మకర్తలు, దాతలు, సేవాభావం కలిగిన ప్రముఖులకు ఆలయ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. బ్రహ్మోత్సవాల నిర్వహణకు సహకారం అందిస్తున్న ధర్మకర్తలు పూర నరసింహ గుప్త, సూరిశెట్టి వీరేశం, చిదర నాగేందర్, ముచ్చర్ల చెన్నకృష్ణ,బచ్చు సత్యనారాయణ, పొద్దుటూరి కుమారస్వామి,మహేందర్ రెడ్డి,పాల్తి శ్రీనివాస్,సాతవల్లి వసంత మనోహర్, గడిగి బాబూరావు,బి.రాములు, భాషపాక సంతోష్, ఎం.సత్యనారాయణ, సి.హెచ్.ఎన్.ఆర్. శ్రీనివాస్,కంకర



పిచ్చిరెడ్డి, కె.వి.ఎం.శర్మ,పి. సుబ్బరాజు, సి.హెచ్. లక్ష్మీనారాయణ, ఎల్.లింగమయ్య లకు ఆలయ కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.

అలాగే ముఖ్య దాతలుగా బండారు కుశలయ్య, సింగిరికొండ నరసింహ, తడుపునూరి సతీష్,కొలిశెట్టి కృష్ణయ్య, వెంకటరమణ జ్యువెలర్స్‌కు చెందిన పలభట్ల సతీష్,సిల్వెల్ కార్పొరేషన్‌కు చెందిన బండారు సుబ్బారావు, క్రిస్టల్ న్యూరో రిహాబిలిటేషన్ సెంటర్‌తో పాటు పలువురు దాతలు అందించిన సహకారంతో బ్రహ్మోత్సవాలు మరింత వైభవంగా నిర్వహించబడుతున్నాయని కమిటీ పేర్కొంది.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ భక్తులకు ప్రత్యేక ఆహ్వానం పలుకుతూ, బ్రహ్మోత్సవాలలో అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకుని,తీర్థ ప్రసాదాలను స్వీకరించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని కోరింది. భక్తులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. దీనిలో భాగంగా గడ్డి అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామి



దేవస్థానం లో పుష్కర బ్రహ్మత్సవం లో 108 వెండీ కలిశాలతో అభిషేకం, సాయంత్రం ఆకురార్పణం, జరిగినది,భక్తులు అధిక సంఖ్యలో పాలుగోన్నారు.

## ఉప లోకయుక్తా కార్యదర్శి సోమిరెడ్డికి ఘన వీడ్కోలు

### సేవలు చిరస్మరణీయం: లోకాయుక్తా జస్టిస్ రాజా శేఖర్ రెడ్డి



కార్యదర్శి సోమిరెడ్డిని సన్మానిస్తున్న లోకాయుక్తా జస్టిస్ రాజశేఖర్ రెడ్డి

**హైదరాబాద్, (ప్రజావినికిడి):** లోకాయుక్తాలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన ఉప లోకాయుక్తా కార్యదర్శి ఏ. సోమిరెడ్డికి బషీర్‌బాగ్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు.లోకాయుక్తా జస్టిస్ రాజా శేఖర్ రెడ్డి సోమిరెడ్డిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా జస్టిస్ మాట్లాడుతూ, సోమిరెడ్డి అంకితభావంతో, నిజాయితీగా విధులు నిర్వహించి లోకాయుక్తాకు మంచి పేరు తీసుకొచ్చారని ప్రశంసించారు. ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పదవీ విరమణ ఉద్యోగానికే పరిమితమని, ఆయన అనుభవం సమాజానికి ఎప్పటికీ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కూడా ఎలాంటి అవసరం వచ్చినా లోకాయుక్తా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లోకాయుక్తా అధికారులు, సిబ్బంది,సోమిరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ లో చారిత్రక ఫిరంగులు మాయం..!

- **చారిత్రక ఫిరంగుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి..**
- **షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు..**
- **షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో మూలకు పడేసిన ఫిరంగి..**
- **రూ.2లక్షలతో మున్సిపల్ ఎదుట నిర్మాణం చేసి పెయింటింగ్ వేసేందుకు నిధులు మంజూరు..**
- **నిధులు ఏమయ్యాయి.. ఫిరంగి మూలకు ఎందుకు పడింది..?**
- **ఫిరంగుల మాయంపై పోలీసులకు ఫిర్యాదు..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక ప్రహరీ గోడ సమీపంలో ఉన్న చారిత్రక ఫిరంగుల నిర్లక్ష్య స్థితిపై రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. తాజాగా ఆ ప్రాంతాన్ని సందర్శించిన బక్కని నర్సింహులు, ఫిరంగి పూర్తిగా దుమ్ము,ధూళితో కప్పబడి ఉండటాన్ని గమనించి స్వయంగా కొంత భాగాన్ని శుభ్రం చేశారు. గతంలో అక్కడ రెండు







ఫిరంగులు ఉండేవని, ప్రస్తుతం ఒకటి మాత్రమే కనిపిస్తోందని, మరొకటి కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు.

ఈ చారిత్రక ఆయుధాలు గతంలో రాజుల నివాసంగా ఉన్న ప్రాంతంలో ఉండేవని, ప్రస్తుతం ఆ ప్రాంతం రైతు కాలనిగా ప్రసిద్ధి చెందిందని ఆయన వివరించారు. చారిత్రక వారసత్వానికి గుర్తుగా ఉన్న ఈ ఫిరంగులను సంరక్షించి, భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బక్కని నర్సింహులు కోరారు.

ఈ మేరకు ఫిరంగిల మాయంపై షాద్‌నగర్ సహాయ పోలీసు కమిషనర్‌కు సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు.

**మరో ఫిరంగి ఏమైంది..?**

గత మున్సిపల్ పాలకుల హయాంలో రెండు లక్షల రూపాయలు మంజూరు చేసి ఫిరంగిని మరమ్మత్తులు చేసి ఏర్పాటు చేస్తామని చెప్పిన మున్సిపల్ పాలకులు ఫిరంగిని మునిసిపల్ వెనుక భాగంలో దుమ్ముదూలిలో పడేయడం వెనుక అర్థం ఏమిటని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ప్రశ్నించారు. ఒకనాడు చారిత్రాక నేపథ్యమున్న జానంపేట ప్రస్తుత ఫరూక్ నగర్ ఆనాటి రాజుల కాలంలో ఎన్నో ఫిరంగులు ఉండేవని 1632లో ఇక్కడి రాజ్యంలో అనేక కోటలు ఫిరంగులు ఉండవని గుర్తు చేశారు.ఆనాటి చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచిన ఆయుధాలు ఫిరంగులు మాయంపై స్థానిక పోలీసులను సంప్రదించనున్నట్లు ఆయన తెలిపారు.బయట మార్కెట్లో లక్షల రూపాయల విలువచేసే ఇలాంటి ఫిరంగులపై ఆర్కియాలజీ శాఖలు పూర్తి దృష్టి సారించాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వెనుక మూలకు పడేసిన ఫిరంగిని చూసి మాజీ ఎమ్మెల్యే బక్కని వాటిని శుభ్రం చేసి రంగు పూయించారు.

## రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌ను సందర్శించిన త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి



**ఎల్బీనగర్,జూన్ 30,(ప్రజావినికిడి):**రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓల్డ్ ఏజ్ హోమ్‌ను ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ శ్రీ శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి సందర్శించారు.ఈ సందర్భంగా ఆశ్రమంలో నివసిస్తున్న వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి ఆశీస్సులు అందజేయడంతో పాటు ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వహణకు ఆర్థిక సహాయాన్ని కూడా అందించారు.జీయర్ స్వామి రాక సందర్భంగా ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు పెద్ది శంకర్ ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీయర్ స్వామివారి ఆశీర్వాదాలతో ఓల్డ్ ఏజ్ హోమ్‌కు సొంత స్థలం సమకూర్చుకోవాలన్న తమ చిరకాల కల త్వరలోనే నెరవేరుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.వృద్ధులకు సేవ చేయడం అత్యున్నత మానవ ధర్మమని పేర్కొన్న జీయర్ స్వామి,ఇలాంటి సేవా కార్యక్రమాలను సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సూచించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్శనతో ఆశ్రమంలోని వృద్ధులు ఆనందం వ్యక్తం చేయగా, ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహం లభించిందని ప్రథ్యం శర్మ, అనిరుద్ శ్రీధర్ శర్మ నాగ మోహన్ శర్మ సుభాషిని పాత్ నాగరాజు గౌడ్ విజయ గౌడ్, రేణుక ప్రకాష్ నవీన్,బాలకృష్ణ దుర్గాప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## ధోబి మహా సంగ్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా వీరేశం మృతికి సంతాప కార్యక్రమం



**నాగోల్,(ప్రజావినికిడి):**మంగళవారం రోజు ఉదయం ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని,ఉప్పల్ మండలం న్యూ నాగోల్ లోని,శ్రీ ప్రజాసంఘాల కార్యాలయం ఎస్ ఏ.డాంగే భవన్ లో తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బొడ్డుపల్లి కృష్ణ(రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)అధ్యక్షతన రజక సామాజిక నేత తెలంగాణ (రజక) ధోబి మహా సంగ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ చల్లా వీరేశం మృతికి సంతాప సూచికంగా సంతాప కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వివిధ స్థాయిలో,వివిధ సంఘాల్లో పనిచేస్తున్నటువంటి ఉద్యమకారులు, నాయకులు వారి చిత్రపటాపాటికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో నాటి రంగారెడ్డి జిల్లా పరిధిలోని కుషాయిగూడ గ్రామపంచాయతీ నుండి ఒక చురుకైన రజక ఉద్ధమకారుడిగా, రజక సామాజిక వర్గాని చైతన్య పరుస్తూ,అనేక ఉద్యమాల్లో పాల్గొంటూ రజకులకుఉన్నటువంటి హక్కులు, వారి చట్టాలు అమలు అయ్యేటట్లు చూస్తూ,వివిధ స్థాయిలోజూ దశాబ్దాల కాలం నుండి పనిచేస్తూ వచ్చారు.గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ఎదిగిన గొప్ప రజక ఉద్యమ నాయకుడు అని గుర్తు చేసుకున్నారు, నిరంతరం రజకుల చైతన్యం కోసం, హక్కుల కోసం,వారి ఎదుగుదల కోసం, గ్రామస్థాయి నుంచి దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలు తిరిగి పర్యటించి చైతన్య పరుస్తూ ఉద్యమాలలో చేస్తూ ఉద్యమాలు నిర్మిస్తూ ఉద్యమాల్లో పాల్గొంటూ వచ్చారు,చివరకు తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా, తుది శ్వాస వరకు,రజక సామాజిక వర్గం అభివృద్ధికి పనిచేసినటువంటి గొప్ప నేత ను నేడు మనం కోల్పోయామని చింతించారు,నేడు మనం వారి ఆశయాలను వారి పట్టుదలను వారి ఆలోచనలను ఏ సామాజిక వర్గం కోసం వాటిని నిరంతరంగాశీ పోరాడి సఫలీకృతం చేసుకున్నప్పుడే నిజమైన నివాలని గుర్తు చేశారు.ఈ యొక్క కార్యక్రమంలో పగిళ్ల జ్యోజి (ఎక్స్ ఎంపిటిసి),డి సత్తయ్య(రజక సామాజిక ఉద్యమకారులు) గోరుగంటి కృష్ణ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు(టి ఆర్ వి ఎస్), బొడ్డుపల్లి చుక్కయ్య రాష్ట్రప్రధాన కార్యదర్శి (రజక అభివృద్ధి సంస్థ) దండు నిరంజన (రాష్ట్ర కార్యవర్గ సభ్యులు) రాజేష్ కుమార్,రజక సంఘం గ్రేట్ హైదరాబాద్ నాయకులు,జి. నరేందర్ యు. మల్లేష్,రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# హయత్‌నగర్ జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో శ్రీమతి పి.ఇందిర పదవీ విరమణ అభినందన సభ..

**హాజరైన గుత్తా సుఖేందర్ రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, గుత్తా అమిత్ రెడ్డి,ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ (ఐఏఎస్)**






**హయత్ నగర్; జూన్,30 (ప్రజా వినికిడి):** హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్ పి హెచ్ ఎస్)లో సుదీర్ఘకాలం విద్యా సేవలందించి పదవీ విరమణ పొందిన శ్రీమతి పుచ్చకాయల ఇందిర పదవీ విరమణ అభినందన సభ మంగళవారం రోజు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గౌరవ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి,రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ (ఐఏఎస్) ముఖ్య అతిథులుగా హాజరై శ్రీమతి ఇందిర గారిని ఘనంగా సన్మానించి,విద్యా రంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలను కొనియాడారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆమె చేసిన కృషి ఆదర్శప్రాయమని పేర్కొంటూ,పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) సుశీంద్ర రావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వేంకటేశ్వర్లు, గోవర్ధన్ రెడ్డి, ఇంచార్జ్ హెడ్‌మిస్ట్రెస్ రమాదేవి,కాంగ్రెస్ నాయకులు,బ్లాక్ అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెగావత్ గణేష్ నాయక్, నక్క శ్రీనివాస్,మతిన్ షరీఫ్,సోలిపురం వెంకట్రామ్ రెడ్డి, కొండోజు శ్రీనివాస్, తదితరులు పాల్గొని శ్రీమతి ఇందిర గారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాజా వరప్రసాద్‌పై సుమోటో కేసు నమోదు చేయాలి..

**షాద్‌నగర్ టీజేఏసీ మాజీ చైర్మన్ టీ.జి. శ్రీనివాస్.. - తెలంగాణ తల్లి విగ్రహంపై వివాదాస్పద వ్యాఖ్యలు సరికావు..**

**షాద్‌నగర్ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వాతావరణాన్ని సృష్టించేందుకు కుట్ర..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే ధ్వంసం చేస్తానంటూ బహిరంగంగా వ్యాఖ్యానించిన రాజా వరప్రసాద్‌పై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని తెలంగాణ పొలిటికల్ జేఏసీ (టీజేఏసీ 20122017) మాజీ చైర్మన్ టీ.జి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తల్లి విగ్రహంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ తల్లి రూపాన్ని ఆమోదించి గెజిట్ విడుదల చేసిందని,రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించడమే కాకుండా రాష్ట్రంలోని 33 జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల్లో కూడా తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ తల్లి అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని,అది తెలంగాణ ప్రజల



ఆత్మగౌరవానికి, రాష్ట్ర అస్తిత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రభుత్వం మరియు రాజకీయ పార్టీ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించకుండా చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని విమర్శించారు.

రాజా వరప్రసాద్ తన వ్యాఖ్యల ద్వారా షాద్‌నగర్ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా కాకుండా ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. ఇప్పటికైనా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ తెలంగాణ సమాజ భావోద్వేగాలను గౌరవించాలని, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం అనవసర వివాదాలకు తావివ్వకూడదని టీ.జి.శ్రీనివాస్ హితవు పలికారు. అలాగే ఇలాంటి వ్యాఖ్యలు తమ వ్యక్తిగత ప్రతిష్ఠతో పాటు పార్టీ ప్రతిష్ఠను కూడా దెబ్బతీస్తాయని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించి నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తేనే ప్రజల ఆదరణ లభిస్తుందని, లేకపోతే చరిత్రలో ప్రజావ్యతిరేక వైఖరితో గుర్తుండిపోతారని ఆయన హెచ్చరించారు.

# ఊరోళ్ళు వద్దంట.. వేరే వాళ్ళు ముద్దట..

**స్థానికతను కాదని బయటి వారికి రేషన్ షాపు..**

**మొగిలిగిద్ద గ్రామ మహిళల ఆగ్రహం..**

**షాద్ నగర్ ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన మహిళలు..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** ఉన్న ఊరివాళ్లను కాదని,స్థానికతను పక్కనపెట్టి గ్రామానికి ఏమాత్రం సంబంధం లేని మహిళకు రేషన్ డీలర్ గా అవకాశం కల్పించి రేషన్ షాపును అందించడంపై ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ మేరకు రేషన్ షాప్ కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలు పానుగంటి నీతూ, కావలి అఖిల, భార్గవి దీనిపై షాద్ నగర్ ఆర్డీఓ సరితకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మీడియాకు విడుదల చేసిన




ప్రకటనలు పేర్కొంటూ.. స్థానికంగా నివాసం ఉన్న తామంతా రేషన్ షాప్ కోసం దరఖాస్తు చేసుకోగా ఈ గ్రామానికి ఏ మాత్రం సంబంధం లేని సిటీ సంధ్యారాణి అనే మహిళకు రేషన్ షాపును కట్టబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.తమ ఊరితో ఆమెకు కూతురుగా గాని, కోడలుగా గాని ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అలాంటి మహిళకు రేషన్ షాపు ఇవ్వడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని తప్పుతోవ పట్టించి ప్రభుత్వ పథకాలను స్వాధీనం చేసుకునేందుకు సదరు మహిళ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. దీనిని అధికారులు గుర్తించి జరగబోయే ఇంటర్వ్యూలో ఆమె పేరును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను ఫిర్యాదు ద్వారా కోరారు. లేదంటే గ్రామస్తులు అంతా ఆందోళనకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. త్వరలోనే గ్రామస్తులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# గులాబీ జెండాతో ఎదిగి... అదే జెండాపై విమర్శలా..?

**బీఆర్ఎస్ ఉద్యమ నాయకులు శివాజీ నాయక్**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ ఉద్యమం కోసం 2001 నుంచే గులాబీ జెండాను భుజాన వేసుకుని పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన మాజీ సహకార సంఘం అధ్యక్షుడు రాజా వరప్రసాద్ గురించి విమర్శలు చేసే ముందు మాజీ జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి తన రాజకీయ ప్రస్థానాన్ని ఒకసారి గుర్తు చేసుకోవాలని బీఆర్ఎస్ ఉద్యమ నాయకులు శివాజీ నాయక్ అన్నారు. 2007లో వెంకట్రాంరెడ్డికి ఫరూఖ్‌నగర్ మండల పార్టీ అధ్యక్ష పదవి దక్కేలా కృషి చేసిన నాయకుల్లో అంజయ్య యాదవ్,రాజా వరప్రసాద్,నక్కల వెంకటేష్ గౌడ్ ఉన్న విషయం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. ఆ సమయంలో పార్టీ ఇచ్చిన అవకాశాలు, ప్రోత్సాహం కారణంగానే ఆయన రాజకీయంగా ఎదిగారని అన్నారు.తదుపరి జడ్పీటీసీ టికెట్ నుంచి ఎన్నికల వరకు పార్టీ పూర్తిస్థాయిలో



అండగా నిలిచిందని,ఆ అవకాశం కల్పించిన నాయకులపైనే ఇప్పుడు విమర్శలు చేయడం రాజకీయ కృతజ్ఞతకు నిదర్శనం కాదని వ్యాఖ్యానించారు.రాజకీయాల్లో పార్టీలు మారడం, అభిప్రాయాలు మారడం సహజమేనని, అయితే తెలంగాణ ఉద్యమం కోసం కష్టపడిన నాయకుల సేవలను తక్కువ చేసి మాట్లాడడం ఎవరికీ శోభనీయమేమీ కాదన్నారు. ప్రజలు అన్ని విషయాలను నిశితంగా గమనిస్తున్నారని, వ్యక్తిగత విమర్శలు అలాగే ఆధారంలేని ఆరోపణల కంటే ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తేనే రాజకీయ నాయకులకు గౌరవం పెరుగుతుందని సూచించారు.ఉద్యమ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు మానుకుని, బాధ్యతాయుతమైన రాజకీయాలు చేయాలని వెంకట్రాంరెడ్డికి హితవు పలుకుతున్నామని శివాజీ నాయక్ తెలిపారు.

# శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంకు అహోబిలం రామానుజ జీయర్ స్వామి సందర్శన



**ఎల్బీనగర్,జూన్ 30,(ప్రజావినికిడి):** శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం సరస్వతి నగర్ కాలనీ, ఎల్బీనగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి కి మంగళవారము నాడు కదిలీపల అలంకరణ మహోత్సవ సందర్భంగా శ్రీ శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ఆలయానికి విచ్చేసి ఆంజనేయ స్వామికి అలంకరించినటువంటి ఫలాన్ని భక్తులకు అందించి హనుమద్వైభవాన్ని వారి అనుగ్రహ భాషణం ద్వారా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ జీడికంటి ప్రద్యుమ్నాచార్యులు,అర్చకులు అనిరుద్ ఆచార్య,నీరజ్, ఆలయ చైర్మన్ విడియాల కేశవులు,సెక్రటరీ ధర్మారావు,వైస్ చైర్మన్ మురళి గౌడ్,ట్రెజరర్ విజయ భాస్కర్ జాయింట్ సెక్రెటరీ శేఖర్ రెడ్డి ఇతర కమిటీ సభ్యులు కాలనీవాసులు భక్తులు పాల్గొని భగవత్ అనుగ్రహం తో పాటు ఆచార్య అనుగ్రహాన్ని పొందారు.

# చైతన్యపురిలో ఎస్ఐఆర్-2026 గణన ఫారాల పంపిణీ

**చైతన్యపురి,జూన్ 30,(ప్రజా వినికిడి):** చైతన్యపురి డివిజన్ పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026)లో భాగంగా బూత్ నంబర్లు 519,522 పరిధిలోని సాయినగర్, సత్యనారాయణపురం కాలనీలలో గణన ఫారాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సీనియర్ సిటిజన్ భవనం,సెయింట్ అలోయిసిస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్‌ల వద్ద స్థానిక బీఆర్ఎస్



డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్, సరూర్ నగర్ ఎంఎంసీ డిప్యూటీ కమిషనర్, ఈఆర్వో శ్రీకాంత్‌తో కలిసి బిఎల్‌ఓలు హరి ప్రసాద్,బాలకృష్ణ కాలనీవాసులకు ఇంటింటికి వెళ్లి గణన ఫారాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తోట మహేష్ యాదవ్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణలు, మార్పులు చేసుకోవాల్సిన వారు తమకు కేటాయించిన బూత్‌ల వద్ద బిఎల్‌ఓలను సంప్రదించి గణన ఫారాలు తీసుకుని ఎస్ఐఆర్-2026లో తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు.ప్రతి అర్హత కలిగిన ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితాలో తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని కోరారు.

# ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**





**నందిగామ,(ప్రజావినికిడి):**నందిగామ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నయ్య పదవీ విరమణ ఆత్మీయ వీడ్కోలు సభ సమావేశానికి షాద్ నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ,గత 14 సంవత్సరాలుగా నందిగామ ప్రాథమిక పాఠశాలలో సేవలు అందించిన రాత్నయ్య శేషజీవితం సుఖ సంతోషాలతో హాయిగా గడపాలని కోరారు. దేశానికి భావిభారత ఉత్తమ పౌరులను కేవలం ఉపాధ్యాయుడు మాత్రమే తీర్చిదిద్దగలదని పేర్కొన్నాడు.తల్లిదండ్రులకు,విద్య నేర్పిన గురువులు దైవంతో సమానమని అన్నారు.వీడ్కోలు సమయంలో విద్యార్థులు, గ్రామస్తులు గురుభక్తిని చాటుకుంటూ ఎంతో ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్‌మెంట్‌పై విద్యార్థులకు ఊరట

**హైకోర్టులో విచారణ జూలై 6కు వాయిదా**

**హైదరాబాద్,జూన్ 30(ప్రజావినికిడి):** ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే జులై 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత విచారణ సందర్భంగా జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అప్పటివరకు కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. గత విచారణలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్-9లోని నాలుగు నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించింది. హైకోర్టు జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులు జులై 6వ తేదీ జరిగే తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో సంబంధిత విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న అనిశ్చితికి తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించిన వివిధ అంశాలపై పిటిషనర్లు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జులై 6వ తేదీ జరగనున్న తదుపరి విచారణలో ప్రభుత్వం, పిటిషనర్ల వాదనలను పరిశీలించనుంది. అనంతరం హైకోర్టు మరిన్ని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ కేసు తీర్పు రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు, విద్యాసంస్థలపై ప్రభావం చూపే అవకాశముండటంతో ఆసక్తి నెలకొంది.

# వెంకట్రాంరెడ్డి గురించి మాట్లాడే అర్హత శివాజీకి లేదు

## కాంగ్రెస్ సీనియర్ నేత మల్లేష్ గౌడ్



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** ఫరూక్‌నగర్ జెడ్పీటీసీ, రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి గురించి విమర్శలు చేసే అర్హత బీఆర్ఎస్ నాయకుడు శివాజీకి లేదని కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లేష్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు.
తెలంగాణ ఉద్యమంలో భాగంగా సకల జనుల సమ్మె సమయంలో షాద్‌నగర్ చౌరస్తాలో నిర్వహించిన రిలే దీక్షలను విజయవంతంగా నడిపించడంలో వెంకట్రాంరెడ్డి కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. రోజుకు పదిమందిని దీక్షా శిబిరంలో కూర్చోబెట్టి వంద రోజుల పాటు రిలే దీక్షలను కొనసాగించిన ఘనత వెంకట్రాంరెడ్డిదేననిఈ విషయం షాద్‌నగర్ ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. వెంకట్రాంరెడ్డికి టీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవి లభించిన సమయంలో మాజీ ఎమ్మెల్యే బిశ్వం కిష్టయ్య పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారని, అంజయ్య యాదవ్ కాదని స్పష్టం చేశారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని శివాజీకి సూచించారు.
అలాగే బీఆర్ఎస్ నాయకుడు రాజ వరప్రసాద్ రాజకీయ వైఖరి గురించి నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసిన వెంకట్రాంరెడ్డిపై అనవసర విమర్శలు చేయడం సరికాదని మల్లేష్ గౌడ్ పేర్కొన్నారు.
ఉద్యమ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు మానుకుని, తెలంగాణ కోసం కష్టపడ్డ నాయకుల సేవలను గౌరవించాలని ఆయన సూచించారు.

# కాంగ్రెస్ తల్లి విగ్రహం పెడితే ఖబర్దార్..

**కాదు కూడదని పెడితే ధ్వంసం చేస్తా..**

**తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్ హెచ్చరిక..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఉద్యమ కాలంలో సకలజనుల ఆమోదంతో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహం కాకుండా కాంగ్రెస్ పార్టీ తయారు చేసిన విగ్రహం పెడితే ధ్వంసం చేయడం ఖాయం,మరోసారి జైలుకు వెళ్ళడానికి కూడా సిద్ధం అంటూ తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్ హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో రాజా వరప్రసాద్ పేర్కొంటూ తెలంగాణ ప్రాంతానికి దక్కాల్సిన నీళ్ళు, ఉద్యోగాలు, హక్కులు ఇవ్వలేని తెలుగు తల్లి మాకవసరం లేదనే షాద్ నగర్ మండల ప్రజా పరిషత్ ఆవరణలో ఉన్న విగ్రహాన్ని ఆనాడు ఉద్యమ సమయంలో ధ్వంసం చేసి సమైక్య రాష్ట్ర పాలనపై తిరుగుబాటు జెండా ఎగురవేశాం, కేసులు,జైళ్ళు ఎదుర్కొన్నాం. మళ్ళీ ఇప్పుడు అదే స్థలంలో కాంగ్రెస్ పార్టీ రూపొందించిన విగ్రహం పెట్టే కుట్రలు జరుగుతున్నాయి. అదే జరిగితే ఆత్మాభిమానం ఉన్న తెలంగాణ ఉద్యమకారులు ఎవరూ సహించరు అంటూ రాజా వరప్రసాద్ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

# రాబోయే పదేళ్లలో 100 షోరూమ్‌లు తెరవడమే తమ లక్ష్యం

## వాసవి గోల్డ్ అండ్ డైమండ్స్ చైర్మన్ రాజు మడిపడిగె

**జూలై 9న తన 51వ పుట్టినరోజు సందర్భంగా,**

**జూలై 1వ తేదీ నుండి జూలై 7వ తేదీ వరకు ఈ ప్రత్యేక బర్త్‌డే ఆఫర్లు**

**విబిజి (వీబీజీ) ఫౌండేషన్ ద్వారా పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, అన్నదానాలు, రక్తదాన శిబిరాలు**




**హైదరాబాద్, జూన్ 30,(ప్రజావినికిడి):**
ప్రముఖ ఆభరణాల సంస్థ వాసవి గోల్డ్ అండ్ డైమండ్స్ చైర్మన్ రాజు మడిపడిగె తన 51వ జన్మదినాన్ని పురస్కరించుకుని వినియోగదారుల కోసం భారీ ఆఫర్లను ప్రకటించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ సంస్థ అనతికాలంలోనే ఇంతటి విజయం సాధించడానికి కారణమైన కస్టమర్లు, వెండర్లు, డైరెక్టర్లు అలాగే మీడియా మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. జూలై 9న తన 51వ పుట్టినరోజు ఉన్న సందర్భంగా, జూలై 1వ తేదీ నుండి జూలై 7వ తేదీ వరకు ఈ ప్రత్యేక బర్త్‌డే ఆఫర్లు అందుబాటులో ఉంటాయని ఆయన వెల్లడించారు. ఈ ఆఫర్లలో భాగంగా ఆభరణాల మేకింగ్ ఛార్జీలు,తరుగు, స్టోన్ ఛార్జీలతో పాటు జీఎస్టీపై కూడా వినియోగదారులకు ఫ్లాట్ 51% డిస్కౌంట్ అందిస్తున్నట్లు ప్రకటించారు. వినియోగదారులు చెల్లించాల్సిన 51% జీఎస్టీని సంస్థే స్వయంగా ప్రభుత్వానికి చెల్లిస్తుందని ఆయన స్పష్టం చేశారు. వీటితో పాటు,రూ. 7,20,000 ఆ పైన విలువైన గోల్డ్, డైమండ్ లేదా సిల్వర్ ఆభరణాలు కొనుగోలు చేసిన వారికి సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటీని ఎటువంటి లక్కీ డ్రా లేకుండా నేరుగా ఉచిత బహుమతిగా అందిస్తామని ప్రకటించారు. అయితే,ఈ ఉచిత స్కూటర్ ఆఫర్ కేవలం మొదట కొనుగోలు చేసిన 51 మంది వినియోగదారులకు మాత్రమే పరిమితం అని,ఈ ఎలక్ట్రిక్ వెహికల్ ఒకసారి ఛార్జింగ్ చేస్తే 60 నుంచి 70 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందని ఆయన వివరించారు. శంషాబాద్ నుండి సోమాజిగూడ వరకు భారీ హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తే సంవత్సరానికి దాదాపు రూ. 4 కోట్లు ఖర్చవుతుందని, అంత భారీ మొత్తాన్ని ప్రచారాల కోసం వృథా చేయకుండా ఆ లాభాన్ని డిస్కౌంట్ల రూపంలో తమ కస్టమర్లకే అందించాలనే సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజు మడిపడిగె తెలిపారు. వ్యాపారం ప్రారంభించిన 8 నెలల్లోనే హైదరాబాద్‌లో మూడు,వైజాగ్‌లో ఒకటి చొప్పున మొత్తం 4 బ్రాంచ్‌లను ఏర్పాటు చేశామని, త్వరలోనే రాజమండ్రి, విజయవాడ, గచ్చిబౌలి,సుచిత్ర, కూకట్‌పల్లి ప్రాంతాల్లో కొత్త షోరూమ్‌లు ప్రారంభించబోతున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది 10 నుంచి 12 షోరూమ్‌లు, రాబోయే పదేళ్లలో 100 షోరూమ్‌లు తెరవడమే తమ లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అలాగే, వ్యాపారంతో పాటు సామాజిక సేవలో కూడా ముందున్నామని, ప్రతి ఏటా తన పుట్టినరోజున విబిజి (వీబీజీ) ఫౌండేషన్ ద్వారా పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, అన్నదానాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కూడా అందజేస్తున్నామని ఆయన వెల్లడించారు

# "రాజా" పిచ్చిపిచ్చిగా ఉందా..?

**తెలంగాణ తల్లికి వ్యతిరేకంగా పేరు ఎత్తితే ఖబర్దార్..**

**తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు "పి.వెంకట్రాంరెడ్డి" హెచ్చరిక..**

**పదేళ్లు పాలించి తెలంగాణ తల్లి విగ్రహానికి గెజిట్ ఇవ్వని మీ కేసీఆర్ ను అడుగు..**

**తెలంగాణ తల్లి అంటే కెసిఆర్ కూతురు కవిత కాదు ఆమె పోలిక ఉన్న విగ్రహం పెట్టించడానికి..**

**తెలంగాణ 33 జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ గెజిట్ ప్రకారం విగ్రహాన్ని ఏర్పాటు చేసింది..**

**ఒకవేళ నువ్వు అలా చేస్తే.. జైలుకెళ్ళి చిప్పకూడు తినడం ఖాయం..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
అదిగో పులి ఇదిగో పులి అంటూ రాజకీయాల్లో పబ్బం కడుపుని బతుకుతున్న నువ్వు తెలంగాణ తల్లి విగ్రహం చేస్తే ధ్వంసం చేస్తామని చెప్పడం సిగ్గుచేటని కెసిఆర్ ప్రభుత్వంలో ఒకలా రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మరోలా వ్యవహరిస్తూ మీ అక్కసు కక్కుతున్న తీరు ప్రజలు గమనిస్తున్నారని ఇలాంటి పిచ్చి మాటలు హెచ్చరికలు మానుకోకపోతే పక్కాగా జైలుకు వెళ్లడం ఖాయమని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు,మాజీ జెడ్పిటిసి పి. వెంకట్రాంరెడ్డి తీవ్ర హెచ్చరికలు జారిచేశారు. మంగళవారం బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు తెలంగాణ ఉద్యమకారుడు రాజా వరప్రసాద్ వ్యాఖ్యలు అహంకారపూరితమైన వని వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎల్లప్పుడూ విషం కక్కుతున్న రాజా వరప్రసాద్ తన శైలి మార్చుకోకపోతే జైలుకు వెళ్లి చిప్పకూడు తినడం ఖాయమని హెచ్చరించారు. నీతో పాటు ఉద్యమం చేసిన మరెందరో ఉన్నారని అన్ని వర్గాల వారి అభిప్రాయం మేరకు మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ తల్లి ప్రభుత్వ ఆమోదం పొందిన విగ్రహాన్ని మాత్రమే పెట్టమని స్థానిక ఉద్యమకారులు కోరుతున్నారని మరి తెలంగాణ తల్లి విగ్రహాన్ని వ్యతిరేకించే నువ్వు ఉద్యమకారుడు కావని వెంకటరామ్ రెడ్డి అన్నారు. "తాను వలచింది రంభ, తాను మునిగింది గంగ" సామెత అన్నట్టు రాజా వరప్రసాద్ తీరు ఉందని విమర్శించారు. తొమ్మిదిన్నర ఏళ్లు అధికారంలో ఉండి తెలంగాణ తల్లి విగ్రహానికి అధికారికంగా గెజిట్ చేయలేని అసమర్థ నాయకులు ఈరోజు రేవంత్ రెడ్డి ఉద్యమకారుల మనోభావాలను అర్థం చేసుకొని తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఆవిష్కరిస్తే దాని జీర్ణించుకోలేక రాజా వరప్రసాద్ మొదటి నుంచి చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు సరికాదన్నారు. ఆనాడు తెలంగాణ తల్లి విగ్రహాన్ని టిఆర్ఎస్ నాయకులు కెసిఆర్ కూతురు కవిత రూపంలో ఉంటే అనేక విమర్శలు వచ్చాయని ఉద్యమకారుల మనోభావాలు దెబ్బతింటున్నాయని భయపడి తెలంగాణ తల్లి విగ్రహానికి గజట్ తేలేదని వెంకటరామిరెడ్డి వివరించారు. తాను ఏది చెబితే అది నిజమేనని భావించి అడ్డగోలు పత్రికా ప్రకటనలు చేస్తే చూస్తూ సహించబోమని కాంగ్రెస్ పేరు ఎత్తితే, అదేవిధంగా తెలంగాణ తల్లి విగ్రహాలను ధ్వంసం చేస్తే నిన్ను జైలుకు పంపించడం ఖాయం చిప్పకూడు తినిపించడం ఖాయమని వెంకట్రాంరెడ్డి తీవ్రంగా హెచ్చరికలు జారీ చేశారు. ఉద్యమకారులే నిన్ను రాళ్లతో కొట్టి తరుముతారని వెంకటరామిరెడ్డి హెచ్చరికలు జారి చేశారు.

# 30 నెలల్లో రైతు సంక్షేమానికి రూ.1.75 లక్షల కోట్ల వ్యయం..

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..










**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
గచ్చిబౌలిలోని శిల్పకళా వేదికలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుతో కలిసి రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో నిధులను విడుదల చేశారు.
ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాలకు రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం గత 30 నెలలుగా రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక కీలక నిర్ణయాలు అమలు చేస్తోందన్నారు. రైతు ఆత్మగౌరవంతో వ్యవసాయం చేసుకునే పరిస్థితులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గత రెండున్నరేళ్లలో వ్యవసాయం, సాగునీరు,ఉచిత విద్యుత్,పెట్టుబడి సాయం,పంటల కొనుగోళ్లు,రైతు బీమా తదితర కార్యక్రమాల కోసం సుమారు రూ. 1.75 లక్షల కోట్లను ప్రభుత్వం వెచ్చించినట్లు తెలిపారు.
రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ ప్రజలకు, ముఖ్యంగా రైతాంగానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. రైతు రుణభారాన్ని తగ్గించేందుకు రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేసి,25.35 లక్షల మంది రైతులకు రూ. 20,677 కోట్ల మేర రుణమాఫీ చేసినట్లు తెలిపారు. ఇది దేశంలోనే అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచిందన్నారు.
రైతు భరోసా పథకం కింద వార్షిక పెట్టుబడి సహాయాన్ని రూ. 10 వేల నుంచి రూ. 12 వేలకు పెంచామని, ఇప్పటికే రూ. 27 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. తాజా విడతలో మరో రూ. 9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు సాగు పెట్టుబడి విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.
రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ,24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా కోసం గత 30 నెలల్లో సుమారు రూ. 30 వేల కోట్లు వ్యయం చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అదేవిధంగా వరి ధాన్యం కొనుగోళ్లు, రైతు బీమా,సన్న వడ్లకు బోనస్, వ్యవసాయ యాంత్రీకరణ, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందన్నారు.
గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి గురైనప్పటికీ తమ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తోందన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు,పెన్షన్లు చెల్లించడంతో పాటు సంక్షేమ పథకాలను ఎక్కడా నిలిపివేయకుండా కొనసాగిస్తున్నామని తెలిపారు.
ధరణి స్థానంలో భూభారతి వ్యవస్థను ప్రవేశపెట్టి రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించే చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.
భూ రికార్డులను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతుల హక్కులను పరిరక్షించే విధంగా కొత్త వ్యవస్థ పనిచేస్తోందన్నారుప్రజలకు సులభమైన, పారదర్శకమైన పాలన అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.
మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళలకు ఉపాధి అవకాశాల కల్పన,యువతకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల అమలు వంటి కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని వివరించారు.
వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని కోరారు. నాణ్యమైన విత్తనాలు, ఆధునిక సాంకేతిక సలహాలు, మార్కెటింగ్ సౌకర్యాలు, రైతులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు.
ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ పాలనకు మూల సూత్రాలని పేర్కొన్నారు.
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీని క్రమబద్ధంగా అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా,రైతు రుణమాఫీ,సన్న వడ్లకు బోనస్ వంటి కార్యక్రమాల ద్వారా రైతాంగానికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.
వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులకు స్థిరమైన ఆదాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతు భరోసా,రైతు రుణమాఫీ,రైతు బీమా,పంటల కొనుగోళ్లు,పంటల వైవిధ్యీకరణ, ఆయిల్ పామ్ విస్తరణ,ఎరువుల డిజిటల్ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కేవలం తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.
నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ,ఉచిత విద్యుత్,వరి ధాన్యం కొనుగోళ్లు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. సన్న వరివంగడాలు సాగు చేసే రైతులకు బోనస్ అందజేస్తామని, సాగునీటి వనరులను మరింత బలోపేతం చేసి తెలంగాణను సస్యశ్యామలంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్,బలరాం నాయక్,ప్రభుత్వ విప్ లు, ఎంఎల్ఏలు, ఎంఎల్సీ లు,రాష్ట్ర రైతు సంఘం చైర్మన్ కోదండ రెడ్డి,వివిధ సంస్థల చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి,మల్ రెడ్డి రాంరెడ్డి చిలుక మధుసూదన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు కిరణ్మయి,చంద్రా రెడ్డి,ఉన్నతాధికారులు,వ్యవసాయ శాఖ అధికారులు,రైతు ప్రతినిధులు,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మనం పౌరులమన్న దానికి గుర్తింపు ఏదీ ?

ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్‌పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది..? దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు? రాజ్యాంగం ఏం చెబుతోంది? పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది? ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు వంటి సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి. విదేశీ వ్యవహారాల శాఖ ఏం చెప్పింది..మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్‌పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ కూడా కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది కేంద్రమే తేల్చాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ కేవలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒకే తరహా యూనివర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒకే ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారంగానే వస్తుంది. చాలామంది పాతతరం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు. వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందుకే ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందుకే రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం




కూడా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు కేవలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగానే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు
జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి. ఇక రెండో మార్గం వారసత్వం. విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశంలో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భారత్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సమీకి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్‌పోర్టు ఇవ్వకూడదనే నియమం కూడా ఏమీ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు కూడా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికారాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లుగా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పొరపాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్‌పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. దీంతో ఇప్పుడు పౌరసత్వ కార్డులు తీసుకోవాల్సిన అవసరం కూడ ఆ రావచ్చు. దీనికి కూడా కేంద్రం కసరత్తు చేస్తుందా అన్నది చూడాలి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.

# పాత వాహనాలకు ఈ20 ప్రమాదమా?.. సుప్రీంకోర్టులో కేంద్రం ఏం చెప్పింది?

**ఈ20పై అధ్యయనం కొనసాగుతోందని కేంద్రం వెల్లడి**

**వచ్చే ఏడాదికి పూర్తి ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్న ప్రభుత్వం**

**20% ఇథనాల్ విధానం కొనసాగుతుందని స్పష్టీకరణ**

**పాత వాహనాలపై ప్రభావం ఉంటుందనడానికి ఆధారాలు లేవన్న కేంద్రం**




**న్యూఢిల్లీ,జూన్ 30(ప్రజావినికిడి):** పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ (ఈ20) కలిపే కార్యక్రమంపై ఇంకా ప్రయోగాత్మక అధ్యయనం కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ విధానం వల్ల ఎలాంటి ప్రభావం ఉంటుందో వచ్చే ఏడాదికి స్పష్టమైన ఫలితాలు అందుతాయని వెల్లడించింది. పాత వాహనాలపై ఈ20 పెట్రోల్ ప్రభావం చూపుతుందన్న చర్చలు కొనసాగుతున్న వేళ కేంద్రం ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ20 ఇథనాల్ సరఫరాకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఈ విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇథనాల్ సరఫరా ఒప్పందాలు ఇప్పటికే ఖరారయ్యాయని, వాటిలో ఒక్కో సంస్థ కోసం మార్పులు చేస్తే దేశవ్యాప్తంగా అమలవుతున్న కార్యక్రమంపై ప్రభావం పడే అవకాశం ఉందని చెప్పారు. అయితే, పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలన్న ప్రభుత్వ నిర్ణయం మారే అవకాశం లేదని అటార్నీ జనరల్ స్పష్టం చేశారు. ఇథనాల్ సరఫరా పరిమాణం మాత్రం డిమాండ్, ఇతర పరిస్థితులను బట్టి మారవచ్చని తెలిపారు. ఈ20 పెట్రోల్‌పై కొంతకాలంగా వినియోగదారుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పాత వాహనాల ఇంజిన్‌కు నష్టం కలిగే ప్రమాదం ఉందని, మైలేజ్ తగ్గే అవకాశం ఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే అలాంటి ఆరోపణలకు ఇప్పటివరకు శాస్త్రీయ ఆధారాలు లేవని కేంద్రం చెబుతోంది. ఇథనాల్ మిశ్రమం వల్ల ముడి చమురు దిగుమతులు తగ్గి విదేశీ మారక నిల్వలు ఆదా అవుతున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటివరకు ఈ కార్యక్రమం వల్ల రూ. 1.4 లక్షల కోట్లకు పైగా విదేశీ మారక వ్యయం తగ్గిందని పేర్కొంది. రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు కర్బన ఉద్గారాలు కూడా తగ్గుతాయని వివరించింది. దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్ సరఫరా ఇప్పటికే ప్రారంభమైంది. 20 శాతం ఇథనాల్ మిశ్రమ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన గడువుకంటే ఐదేళ్ల ముందే, 2025లోనే సాధించింది. ఇప్పుడు 2030 నాటికి ఈ మిశ్రమాన్ని 30 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# అరుణాచల్‌లో చైనా చొరబాట్లు

## మీడియా కథనాలను తోసిపుచ్చిన ఆర్మీ


**న్యూఢిల్లీ,జూన్ 30 (ప్రజావినికిడి):**



చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం కావడంతో, వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారమని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్‌లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి ప్రతాన్ని సమర్పించింది. భారత్–చైనా సరిహద్దు సమీపంలో పీఎల్ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10– 15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది. ఇటీవల బీజింగ్‌లో భారత్–చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.

# తృణమూల్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ

## పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్‌పై అత్యవసర విచారణకు నో



**కోల్‌కతా,జూన్ 30 (ప్రజావినికిడి):**తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలన్న టీఎంసీ విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. టీఎంసీ బ్యాంక్ ఖాతాల నిలిపివేత కారణంగా పార్టీ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, తక్షణ విచారణ అవసరమని ఆ పార్టీ తరఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. అయితే ఈ అంశంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంటూ కోల్‌కతా హైకోర్టు వెంటనే విచారణ చేపట్టేందుకు నిరాకరించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ అమృతా సిన్హా సాధారణ లిస్టింగ్ పక్రియ ప్రకారమే పిటిషన్ విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు బ్యాంక్ ఖాతాలు స్తంభించిపోయాయి. ఖాతాలు ఫ్రీజ్ చేయడం వల్ల ఆ పార్టీ రోజువారీ కార్యకలాపాలు, ఉద్యోగుల చెల్లింపులు, సంస్థాగత వ్యయాలు, రాజకీయ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధుల వినియోగంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని టీఎంసీ న్యాయవాదులు వాదించారు. అయితే హైకోర్టు తక్షణ ఉపశమనం ఇవ్వడానికి నిరాకరించడంతో టీఎంసీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కేసు విచారణకు వచ్చే వరకు ఆ పార్టీ నేతలు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దిలా ఉండగా, కోల్‌కతా హైకోర్టు నిర్ణయం నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన అవకాశాలను పరిశీలిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వం, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఆలోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసు రెగ్యులర్ విచారణలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# యూట్యూబ్ వీడియోలు చూసి ఇంట్లో కాన్పు చేసుకున్న మహిళ.. రక్తస్రావంతో మృతి

**తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో విషాదం**

**తొలి కాన్పు సమయంలో సిజేరియన్ అయిన వైనం**

**రెండో కాన్పును ఇంట్లోనే ప్రయత్నించిన 32 ఏళ్ల మహిళ**



**తిరుప్పూర్ జూన్ 30 (ప్రజావినికిడి):** తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో ఒక హృదయవిదారక ఘటన వెలుగుచూసింది. కేవలం యూట్యూబ్ వీడియోల సమాచారాన్ని నమ్మి, ఇంట్లోనే ప్రసవం చేసుకోవడానికి ప్రయత్నించిన 32 ఏళ్ల శశికళ అనే మహిళ తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు కోల్పోయింది. శశికళకు ఇది రెండో ప్రసవం. మొదటి కాన్పు సమయంలో ఆమెకు సిజేరియన్ అయింది. దాంతో అల్లోపతి వైద్యంపై ఒక రకమైన విరక్తి పెంచుకున్న ఆమె, ఈసారి ఎలాగైనా సహజ పద్ధతిలోనే ప్రసవం కావాలని గట్టిగా అనుకుంది. మళ్లీ సిజేరియన్ అవుతుందేమోనన్న భయంతో, ఈ కుటుంబం రెగ్యులర్ వైద్య పరీక్షలను, ప్రభుత్వ ఆరోగ్య కార్యకర్తల సూచనలను పూర్తిగా పక్కన పెట్టేసింది. యూట్యూబ్‌లో వచ్చే వీడియోలను చూసి ఇంట్లోనే కాన్పు చేసుకోవాలని నిర్ణయించుకుంది. చివరకు అనుకున్నట్టుగానే శశికళ ఇంట్లోనే ఒక ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిచ్చింది. కానీ, ఆ తర్వాతే అసలు సమస్య మొదలైంది. కాన్పు పూర్తయ్యాక ప్లజెంటా (మాయ)కు సంబంధించిన తీవ్రమైన సమస్యలు తలెత్తడం, విపరీతంగా రక్తస్రావం అవ్వడంతో ఆమె పరిస్థితి విషమించింది. కంగారుపడిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను పెరుందురైలోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి, అక్కడి నుంచి మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినప్పటికీ... అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో వైద్యులు ఆమెను కాపాడలేకపోయారు.
ప్రస్తుతం ఆ నవజాత శిశువు సురక్షితంగానే ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల నుండి ఎలాంటి ఫిర్యాదు అందకపోయినప్పటికీ, పోలీసులు సుమోటోగా స్పందించి శశికళ భర్త కొలంతైసామిపై కేసు నమోదు చేశారు. సరియైన అవగాహన లేని ఆన్‌లైన్ ఆరోగ్య చిట్కాలు, సలహాలు నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ప్రసవ సమయాల్లో కచ్చితంగా నిపుణులైన వైద్యుల పర్యవేక్షణ అవసరమని ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు.. కేంద్రం హై అలర్ట్!



**న్యూఢిల్లీ,జూన్ 30 (ప్రజావినికిడి):** :జులై 3న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. యాత్రను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు ప్రయత్నించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు అప్రమత్తం చేసినట్లు సమాచారం. దీంతో యాత్ర మార్గమంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నిఘా సంస్థలు గుర్తించిన సమాచారం ప్రకారం.. జమ్ముకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరిపే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించే యత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో యాత్ర మార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేధ ఆధారిత కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేశారు. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, యాత్రికులు అధికారిక సూచనలు పాటించాలని, వదంతులను నమ్మొద్దని భద్రతా వర్గాలు సూచిస్తున్నారు.

# రాష్ట్రంలో ఖనిజ నిల్వల గుర్తింపునకు మినరల్ మ్యాపింగ్

**ఖనిజ సంపదపై చంద్రబాబు మాస్టర్ ప్లాన్..**
**ఆదాయం పెంపే లక్ష్యంగా కీలక ఆదేశాలు**

**అమరావతి, జూన్ 30(ప్రజావినికిడి):** రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అపారమైన ఖనిజ సంపదను సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు సమగ్రమైన 'మినరల్ మ్యాపింగ్' చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేవలం ముడి ఖనిజాలను వెలికితీయడమే కాకుండా, వాటికి రాష్ట్రంలోనే విలువ జోడించే (వాల్యూ యాడిషన్) ప్రక్రియలను ప్రోత్సహించడం ద్వారా గరిష్ఠ ప్రయోజనం పొందాలని స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "దేశంలోని కొన్ని రాష్ట్రాలు కేవలం ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయంతోనే రెవెన్యూ మిగులు సాధిస్తున్నాయి. మన రాష్ట్రంలోనూ ఖనిజ సంపదకు మార్కెట్ క్యాపిటలైజేషన్ ద్వారా విస్తృత



అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎండీసీ ద్వారా ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలి. దీనిపై నిపుణులతో అధ్యయనం చేయించి, ఒక పటిష్టమైన విధానాన్ని రూపొందించాలి" అని అన్నారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా వంటి ఖనిజాలకు ఇక్కడే విలువ జోడింపు ప్రక్రియలు జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

**అరుదైన ఖనిజాలపై ప్రత్యేక దృష్టి**

ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్, అణు ఇంధనం వంటి వ్యూహాత్మక రంగాల్లో కీలకంగా ఉపయోగపడే అరుదైన భూ ఖనిజాల (రేర్ ఎర్త్ మినరల్స్)పై సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏపీ, ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో లభ్యమయ్యే ఈ ఖనిజాల కోసం ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ వంటి అత్యంత విలువైన ఖనిజాల నిల్వలను కచ్చితంగా అంచనా వేయాలన్నారు.

అలాగే, రాష్ట్రంలోని జొన్నగిరి, చిత్తూరు జిల్లా చిగురుగుంట ప్రాంతాల్లో ఉన్న బంగారం నిల్వలపై మరింత లోతుగా అధ్యయనం చేసి, ఇతర బ్లాకుల్లోనూ అన్వేషణ జరపాలని గనుల శాఖకు సూచించారు. రాష్ట్రంలో మొత్తం 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్, ఇతర విలువైన ఖనిజాలను గుర్తించినట్లు అధికారులు ఈ సమావేశంలో సీఎంకు వివరించారు.

ప్రజలకు ఉచితంగా అందిస్తున్న ఇసుక విధానంలో పారదర్శకతకు, అక్రమాలకు తావులేకుండా చూడటానికి టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. "ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం సుమారు రూ.1000 కోట్ల ఆదాయాన్ని వదులుకుని ఇసుకను ఉచితంగా అందిస్తోంది. ఇది దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే" అని స్పష్టం చేశారు.


# మామను గదిలో నిర్బంధించారంటూ ఫిర్యాదు

**ఆస్తి వివాదం నేపథ్యంలో కుటుంబ కలహాలు.. పోలీసులను ఆశ్రయించిన తండ్రి, కుమారుడు**

**నర్సంపేట/జూన్ 30(జర్నలిస్ట్ జర్నీ న్యూస్ )** నర్సంపేట పట్టణంలో ఆస్తి వివాదం నేపథ్యంలో ఒక కుటుంబంలో చోటుచేసుకున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. తనను కోడలు గదిలో నిర్బంధించిందని ఆరోపిస్తూ వృద్ధుడు రంగారెడ్డి పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి కథనం ప్రకారం.. కుటుంబంలో కొంతకాలంగా ఆస్తి విషయమై విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తన కోడలు డాక్టర్ నవత, తన కుమారుడు మోతె కిరణ్‌పై దాడి చేయించిందని, దీంతో ఆయన ప్రాణభయంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని ఆరోపించారు. అనంతరం తనను ఇంట్లోని ఒక గదిలో ఉంచి బయట నుంచి తాళం వేసి వెళ్లిపోయిందని రంగారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను గట్టిగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు



గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గది తాళం తెరిపించి తనను బయటకు తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ ఘటన అనంతరం తనకూ, తన కుమారుడు కిరణ్‌కూ ప్రాణహాని ఉందని పేర్కొంటూ రంగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



# రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఇరిగేషన్ ఏఈఈ పట్టివేత

**- రైతు ఫిర్యాదుతో ఏసీబీ వల - నగదు స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్**

**అశ్వారావుపేట/ జూన్ 30(ప్రజావినికిడి):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏసీబీ వరుస దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా అశ్వారావుపేట ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) ఎల్. శ్రీనివాస్ రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా ఖమ్మం రేంజ్ ఏసీబీ అధికారులు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేట పట్టణంలోని దొంతికుంట చెరువు నుంచి ఓ రైతు తన పొలానికి మట్టి తరలించేందుకు అనుమతి ఇచ్చే విషయంలో ఏఈఈ ఎల్. శ్రీనివాస్



రూ.2 లక్షలు డిమాండ్ చేసినట్లు రైతు ఏసీబీని ఆశ్రయించాడు. అధికారులు రూపొందించిన ప్రణాళిక ప్రకారం అశ్వారావుపేటలోని ఇరిగేషన్ కార్యాలయంలో రైతు నుంచి రూ.2 లక్షలు స్వీకరిస్తుండగా ఖమ్మం రేంజ్ ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలోని బృందం దాడి చేసి అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. లంచంగా స్వీకరించిన నగదును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

# అర్హులైన ఒక్క ఓటరు కూడా మిస్ కాకూడదు

**: మంత్రి పొన్నం ప్రభాకర్ -రూ.25 లక్షల సీసీ రోడ్లను ప్రారంభించిన మంత్రి**

**భీమదేవరపల్లి మండలంలో 11 వేల తటస్థ ఓట్లపై అప్రమత్తంగా ఉండాలి**





**భీమదేవరపల్లి/జూన్ 30(ప్రజావినికిడి):** హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పొన్నం ప్రభాకర్ సందర్శించి పరిశీలించారు. ఎన్యూమరేషన్ ప్రక్రియ పురోగతిని పరిశీలించిన మంత్రి, అర్హత కలిగిన ప్రతి ఓటరిని గుర్తించి నిబంధనల ప్రకారం సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతోందని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండేలా ప్రజాప్రతినిధులు,



పార్టీ నాయకులు, బీఎల్‌వోలకు సహకరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో సాంకేతిక కారణాల వల్ల పెద్ద సంఖ్యలో తటస్థ ఓట్లు ఉన్నాయని పేర్కొంటూ, హుస్నాబాద్ నియోజకవర్గంలో సుమారు 61 వేల తటస్థ ఓట్లు ఉండగా, భీమదేవరపల్లి మండలంలోనే సుమారు 11 వేల తటస్థ ఓట్లు ఉన్నాయని తెలిపారు. రాబోయే పది రోజుల పాటు బీఎల్‌వోలకు పూర్తి సహకారం అందించి ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. భీమదేవరపల్లి మండలంలోనే దాదాపు 6 వేల రేషన్ కార్డులు మంజూరు చేశామని వెల్లడించారు. ధర్మారం గ్రామ అభివృద్ధికి ఇప్పటికే రూ.25 లక్షల సీసీ రోడ్లు, ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.7 లక్షలు, ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. గ్రామ ప్రధాన రహదారి అభివృద్ధికి కూడా త్వరలో అదనపు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆశారాం బాపుకు దక్కని ఊరట

**బెయిల్ మంజూరుకు సుప్రీం నిరాకరణ**

**న్యూఢిల్లీ,జూన్30(ప్రజావినికిడి):** 2013లో ఓ బాలికపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న స్వయంప్రకటిత ఆధ్యాత్మిక గురువు బాబా ఆశారం బాపునకు సుప్రీంకోర్టులో తాత్కాలికంగా ఊరట లభించలేదు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరించింది. తనపై విధించిన జీవిత ఖైదును సమర్థిస్తూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆశారాం బాపు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆశారాం పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం స్పందించే వరకు ఆశారాంకు ఎలాంటి బెయిల్ మంజూరు చేయబోమని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ఆశారాం తరఫు న్యాయవాదులు వైద్య కారణాలను ప్రస్తావిస్తూ బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. అయితే ప్రస్తుతం అలాంటి తక్షణ ఉపశమనానికి అవకాశం లేదని ధర్మాసనం తెలిపింది. ప్రాణాలకు ముప్పు కలిగించేంత తీవ్రమైన అత్యవసర పరిస్థితి ఉన్న సందర్భాల్లో మాత్రమే బెయిల్ అంశాన్ని పరిశీలించగలమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. రాజస్థాన్ ప్రభుత్వం సమర్పించే కౌంటర్‌ను పరిశీలించిన తర్వాతే బెయిల్‌పై తదుపరి నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా, 2013లో రాజస్థాన్‌లో ఓ మైనర్‌పై అత్యాచారం చేసిన కేసులో ఆశారాం బాపు దోషిగా తేలారు. అనంతరం న్యాయస్థానం ఆయనకు జీవిత ఖైదు విధించింది. ప్రస్తుతం ఆశారాం జోధ్‌పూర్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో ఆయన న్యాయపరమైన పోరాటం కొనసాగుతున్నప్పటికీ, తక్షణ ఉపశమనం మాత్రం లభించలేదు. ఇప్పుడు రాజస్థాన్ ప్రభుత్వం సమర్పించే అఫిడవిట్, తదుపరి విచారణలో కోర్టు అభిప్రాయం కీలకంగా మారనున్నాయి.

-------------

# 30 నెలల్లో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధుల ఎగవేత

**సభల పేరుతో నాటకాలు తప్ప రైతులకు చేసిందేమీ లేదు**
**మరోమారు ఎక్స్ వేదికగా రేవంత్‌పై కెటిఆర్ విమర్శలు**



**హైదరాబాద్,జూన్ 30(ప్రజావినికిడి):** 30 నెలల పాలనలో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ఎగ్గొటారని, పైగా సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. ఏకంగా నాలుగుసార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టారని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. మంగళవారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఎక్స్ వేదికగా మాజీ మంత్రి విరుచుకుపడ్డారు. మీ 30 నెలల ముదనష్టపు పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా? గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా? కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే.. నీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించు కుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల

గారడీ చేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం. ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశావు. 72 సార్లు నీ ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకో. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు. కేసీఆర్ టంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

# మామిడిరైతులు ఆందోళన చెందవద్దు

**ఈయేడు కూడా కేజీకి రై.4 చెల్లిస్తున్నాం -మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హామీ**



**అమరావతి,జూన్ 30(ప్రజావినికిడి):** మామిడి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. వారికి అండగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఏడాది కూడా కూటమి ప్రభుత్వం రైతులకు కేజీకి రూ.4 చెల్లించి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా కేజీకి రూ.4 ముందస్తు చెల్లించి మామిడి కొనుగోళ్లు కొనసాగిస్తున్నామని తెలిపారు. పంట దిగుబడి అధికంగా రావడంతో తాత్కాలికంగా కొనుగోళ్లపై ఒత్తిడి ఏర్పడిందని చెప్పారు. గత ఏడాది మామిడి రైతులకు సుమారు రూ.190 కోట్లు చెల్లించి ప్రభుత్వం ఆదుకుందన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. కొనుగోళ్లలో జాప్యం జరిగితే సంబంధిత ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన వైసీపీ సానుభూతి కంపెనీలు కొనుగోళ్లలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించమన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రైతులను వైసీపీ.. రాజకీయాలకు వాడుకోవడం మానుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు.

# ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబో..

## సుబ్రమణ్యస్వామిపై నాగవంశీ వ్యాఖ్యలపై దుమారం

ద




యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ప్రకటించిన సరికొత్త మైథలాజికల్ చిత్రం అప్పుడే సోషల్ మీడియాలో ఒక పెద్ద వివాదానికి కేంద్రబిందువుగా మారింది. సుబ్రహ్మణ్య స్వామి నేపథ్యంతో రాబోతున్న ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ భారీ అంచనాలను పెంచినప్పటికీ, నిర్మాత సూర్యదేవర నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక క్యాప్షన్ తమిళ నెటిజన్లకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. మురుగన్‌ను ఉద్దేశించి ఆయన ఉత్తరాదిన జన్మించి, హృదయభూమిలో రూపుదిద్దుకుని, దక్షిణాదిన పూజలందుకుంటున్నాడు అని పోస్ట్ చేయడమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. తమిళ సంస్కృతి, ప్రాచీన సంగం సాహిత్యం ప్రకారం మురుగన్‌ను తమిళుల దేవుడు అని పిలుస్తారు కాబట్టి, ఆయనను ఉత్తరాదిన జన్మించాడని అనడంపై తమిళ సినీ ప్రియులు తీవ్రంగా మండిపడుతున్నారు. అంతేకాకుండా, అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో తమిళానికి బదులు సంస్కృత శ్లోకాన్ని ఉపయోగించడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ సినిమాను బాయ్‌కాట్ చేయాలంటూ ఎక్స్ లో ట్రోల్స్ చేస్తున్నారు. అయితే మరోవైపు, పురాణాల ప్రకారం శివపార్వతుల కుమారుడైన కార్తికేయుడు హిమాలయాల్లో జన్మించాడని, దేవుడిని ఒక ప్రాంతానికే పరిమితం చేయలేమని మరికొందరు నెటిజన్లు నాగవంశీ వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు. ఈ సున్నితమైన భక్తిరస స్జబెక్ట్‌ను సాంస్కృతిక విలువలకు భంగం కలగకుండా ఎంతో జాగ్రత్తగా తెరకెక్కించాలని పలువురు మేకర్స్‌ను కోరుతుండగా, కేవలం ఒక్క పోస్టర్‌ను చూసి సినిమాను జడ్జ్ చేయవద్దని ఎన్టీఆర్ అభిమానులు మద్దతుగా నిలుస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్ర వివాదంపై హారిక అండ్ హాసిని క్రియేషన్స్ టీమ్ ఇంకా ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వనప్పటికీ, ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న క్రేజ్ మరియు అంచనాలు మాత్రం దేశవ్యాప్తంగా రోజురోజుకూ రెట్టింపవుతున్నాయి.

# అజయ్ దేవగణ్ చౌహాన్ టీజర్


## చిత్రంలో సంభాషణలపై క్షత్రియుల అభ్యంతరం



బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు నీరజ్ యాదవ్ తెరకెక్కిస్తున్న 'చౌహాన్' సినిమా టీజర్ విడుదలైన కొన్ని రోజుల్లోనే తీవ్ర వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమాపై క్షత్రియ పరిషత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ముఖ్యంగా ఈ చిత్ర టీజర్‌లో అజయ్ దేవ్‌గణ్ పలికిన 'పఠానులకు చెప్పండి, చౌహాన్ వస్తున్నాడు' అనే వివాదాస్పద డైలాగ్ సోషల్ మీడియా వేదికగా పెను దుమారాన్ని రేపుతోంది. కాశ్మీర్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో పెల్లెట్ గన్‌ల వాడకంపై ఉన్న సంభాషణలు, మతపరమైన అంశాలు సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని నెటిజన్లతో పాటు నటి స్వరా భాస్కర్ వంటి పలువురు ప్రముఖులు సైతం ఇప్పటికే విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే తాజాగా క్షత్రియ పరిషత్ ఈ చిత్రంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను విడుదల చేయడం సినిమా పరిశ్రమలో మరియు రాజకీయ వర్గాలలో తీవ్ర సంచలనంగా మారింది. క్షత్రియ పరిషత్ తమ ప్రకటనలో ఈ చిత్రాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ప్రస్తుత సమాజంలో స్వార్థపూరిత రాజకీయ లబ్ది కోసం, ఓట్ల వేట కోసం చౌహాన్ వంశం పేరును మరియు రాజ్‌పుత్ సమాజ అస్తిత్వాన్ని వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడింది. రాజ్‌పుత్ చరిత్ర అనేది ఎన్నికల ప్రచారాలకు లేదా బాధ్యతారహితమైన మీడియా సంచలనాలకు వాడుకునే రాజకీయ వస్తువు కాదని వారు స్పష్టం చేశారు. చిత్ర నిర్మాతలు కేవలం వివాదాలు సృష్టించి లాభపడాలనే ఉద్దేశంతోనే ఇలాంటి సున్నితమైన అంశాలను తెరపైకి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్‌పుత్ వారసత్వాన్ని వివాదాలకు ఎరగా వేయకూడదని డిమాండ్ చేశారు. అయితే ఈ మొత్తం వివాదంపై మరియు క్షత్రియ పరిషత్ లేఖపై చౌహాన్ చిత్ర యూనిట్ కానీ, హీరో అజయ్ దేవ్‌గణ్ కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వలేదు.

# అల్లరి నరేశ్..మళ్లీ కామెడీ ట్రాక్

## కొత్త మూవీ రంభ ఊర్వశి మేనక ఫస్ట్ లుక్ విడుదల




కామెడీ కింగ్ అల్లరి నరేష్ మంగళవారం తన పుట్టినరోజును జరుపుకున్నారు. అయితే ఈ ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని తన అభిమానులకు ఆయన ఒక అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. తన కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 65వ సినిమా టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా ప్రకటిస్తూనే, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సరికొత్త సోషియో ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. ఈ చిత్రానికి చంద్ర మోహన్ చింతడ దర్శకత్వం వహిస్తుండగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ కలయికలో వస్తున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. 'యముడికి మొగుడు' సినిమా తర్వాత దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అల్లరి నరేష్ మళ్లీ ఒక ఫాంటసీ జానర్ వైపు అడుగులు వేస్తుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ విషయానికి వస్తే, ఇది నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆకాశంలో మేఘాల మధ్య దేవలోకానికి వెళ్లే మెట్లపై అల్లరి నరేష్ ఎంతో స్టైలిష్‌గా కూర్చుని ఉండటం, ఆయన చేతిలో రంభ, ఊర్వశి, మేనకల పేర్లు రాసి ఉన్న ఒక పురాతన శాసనం పట్టుకుని ఉండటం పోస్టర్‌లో కనిపిస్తోంది. అలాగే ఆయన చుట్టూ మేఘాలలో అప్సరసలు విహరిస్తున్న దృశ్యం ఫాంటసీ ఎలిమెంట్స్‌ను అద్భుతంగా ఎలివేట్ చేస్తోంది. రంగురంగుల గ్రాఫిక్స్‌తో, వైవిధ్యమైన డిజైన్‌తో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే.. ఇంద్రలోకానికి, భూలోకానికి మధ్య జరిగే ఒక మాయాజాలం, అందులో నుంచి పుట్టే కడుపుబ్బ నవ్వించే కామెడీ, ఊహించని ట్విస్టులతో ఈ సినిమా సాగనుందని స్పష్టమవుతోంది. ఈ భారీ విజువల్ కామెడీ డ్రామాలో వెన్నెల కిషోర్, నరేష్ వికె, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఛోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# నాగబంధంలో అద్భుతమైన పాత్ర నాది

## నటి నభా నటేశ్ ఆసక్తిక విషయాలు వెల్లడి



నేను నటించిన ఓ అరుదైన సినిమా 'నాగబంధం'. ఇందులో పార్వతి అనే వేద విద్యార్థిని పాత్రలో నేను కనిపిస్తా. తన కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా పోరాడే ఆ పాత్ర కథకు కీలకం. ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురిచేసే ఆ పాత్ర చుట్టూనే కథ తిరుగుతుంది. ఇలాంటి పాత్రలు మళ్లీ మళ్లీ చేయాలనుకున్నా వచ్చేవి కాదు. దర్శకుడు అభిషేక్ నామా ఈ కథ చెప్పిన తీరు, ఆయన విజన్ వినగానే నేను ఇందులో భాగం కావాలని నిర్ణయించుకున్నా. ఈ సినిమాని థియేటర్లలో చూసేందుకు ప్రేక్షకుల్లాగే నేనూ ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నానని నటి నభా నటేశ్ అన్నారు. ప్రేక్షకులు చూసి ఆశ్చర్యపోయేలా, నటిగా నేనెంతో గర్వపడేలా చేసే పాత్రనే 'నాగబంధం'లో చేశానని కథానాయిక నభానటేశ్ తెలిపారు. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఈమె అవకాశాల్ని సొంతం చేసుకుంటూ తెరపై మెరుస్తోంది. ఇటీవల 'నాగబంధం'లో ఓ కథానాయికగా నటించింది. విరాట్‌కర్ణ కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జులై 3న ప్రేక్షకుల ముందుకొస్తోంది. తాను పోషించిన పార్వతి పాత్ర కోసం సిద్ధం కావడానికి రోజూ రెండు గంటలు సమయం పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకోవల్సి వచ్చేది. నమోరే... పాటతోపాటు మరో జానపద గీతం కూడా చేశా. ఈ రెండు పాటలు విజువల్‌గా చాలా ఘనంగా ఉంటాయి. ఐదువేల మంది డ్యాన్సర్లతో నమోరే.. పాటని తెరకెక్కించిన విధానం, తెరపైన ఆ పాట సాగే విధానం చూసి అందరూ ఆశ్చర్యపోతారు. అలాంటి పాటలో నటించడం ఓ నటిగా నాకూ చాలా కొత్త అనుభవం. ఈ సినిమా కోసం దాదాపు 10 సెట్స్ నిర్మించారు. అనంత పద్మనాభ స్వామి ఆలయ సెట్ నిజమైన ఆలయాన్ని తలపిస్తుంది. అక్కడ చిత్రీకరణ జరిగినన్ని రోజులూ మేమంతా నియమాలతో పనిచేశాం. పూర్తిగా శాకాహారమే తిన్నాం. రోజూ పూజ తర్వాతే అక్కడ చిత్రీకరణ మొదలయ్యేది. ఈ సినిమా నిర్మాణం, ప్రచారం నిర్మాతల అభిరుచికి అద్దం పడుతుందని నభా అన్నారు.

# టాక్సిక్ ఓ అద్భుతమైన అనుభం

## నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు



'కేజీఎఫ్' చిత్రాల విజయాల తర్వాత కథానాయకుడు యశ్ నుంచి రానున్న సినిమా 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రంపై నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన 9 నిమిషాల కట్‌ను వీక్షించిన ఆమె, సినిమా విజువల్ ట్రీట్‌గా ఉండనుందని స్పష్టం చేశారు. ఈ సినిమాలో యశ్‌తో కలిసి పనిచేసిన తర్వాత, నేను ఆయనకు అభిమానిని అయ్యాను. అంతకుముందు ఆయనొక పెద్ద స్టార్, ఆయనకు భారీ ఫాలోయింగ్ ఉంది అని మాత్రమే నేను అనుకునేదాన్ని. కానీ ఆయన పని చేసే విధానాన్ని, పనిపై ఆయనకున్న అంకితభావాన్ని కళ్లారా చూసి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తర్వాత యశ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటారు. ఇటీవలే ఇందులో చిన్న సన్నివేశం చూశాను. నేను ఇప్పటి వరకూ అలాంటి విజువల్స్ ఏ సినిమాలోనూ చూడలేదు. ఆ సన్నివేశాలు అభిమానులకు కచ్చితంగా నచ్చుతాయని హ్యూమా అన్నారు. ఆగస్టు 26న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో యశ్ రెండు భిన్నమైన లుక్స్‌లో కనిపించనున్నారు. పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ముస్తాబైన ఈ సినిమాని గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించారు. కియార, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.

------

# సమంత ప్రెగ్నెంట్ అని తెలిసాక జాగ్రత్త పడ్డాం

## మా ఇంటి బంగారం షూటింగ్‌పై నందినిరెడ్డి వెల్లడి



అగ్ర కథానాయిక సమంత తల్లి కానున్న విషయం తెలిసాక..మా ఇంటి బంగారం' షూట్‌లో ఆమె కోసం చాలా జాగ్రత్తలు తీసుకున్నామని దర్శకురాలు నందినిరెడ్డి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఈ సినిమా షూటింగ్ సమయంలో సమంత ఈ గుడ్‌న్యూస్ తనకు చెప్పారని.. ఎవరికీ చెప్పొద్దన్నారని

9 గంటలకు షూట్ ప్రారంభమవుతుందంటే సమంత కచ్చితంగా ఆ సమయానికి సెట్‌లో ఉంటారు. ఈ చిత్రంలో తస్సాదియా సాంగ్ షూటింగ్ అప్పుడు సమంతకు జ్వరం వచ్చిందని 11.30కు వస్తారని అన్నారు. నాకేమో టెన్షన్.. మొదట ఈ పాట 4 రోజులు చేయాలని అనుకున్నాం. షెడ్యూల్ కారణంగా రెండు రోజులకు కుదించాల్సి వచ్చింది. ఒకవైపు సామ్ హెల్త్ బాలేదు.. ఎలా పూర్తవుతుందా అని టెన్షన్ పడ్డాను. చెప్పినట్లే 11.30కు వచ్చి షూట్ కంప్లీట్ కాగానే వెళ్లిపోయింది. మళ్లీ రెండోరోజు రాగానే జ్వరం తగ్గిందా.. ఎందుకు అలా తరచూ వస్తోంది అని అడిగాను. 'జ్వరం కాదు.. నేను ప్రెగ్నెంట్‌ని. ఈ విషయం ఎవరికీ చెప్పకు' అని సమంత చెప్పింది. నాకు చాలా ఆనందం వేసిందని నందినిరెడ్డి అన్నారు. సమంత నాకు ఆ మాట చెప్పగానే డ్యాన్స్ మాస్టర్ దగ్గరకు వెళ్లి ఆమెకు ఆరోగ్యం బాలేదు. తనతో ఎక్కువ రిహార్సల్స్ చేయించొద్దు అని చెప్పాను. చిన్నచిన్న స్టెప్స్‌తో కంటిన్యూ చేద్దామని చెప్పా. సమంత మార్నింగ్ సిక్‌నెస్‌తోనే ఆ పాట పూర్తి చేసింది. కార్ యాక్సిడెంట్ సీన్, ఛేజింగ్ సన్నివేశం కూడా తర్వాత షూట్ చేసినవే. చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. 3.30 తర్వాత నీడలో షూట్ చేశాం. ఆమె ఎక్కువ ఒత్తిడికి గురికాకుండా చూసుకున్నాం అని నందినిరెడ్డి చెప్పారు. సమంతను బెస్ట్‌గా చూపించాలనే ఏకైక ఉద్దేశంతోనే ఈ చిత్ర బృందమంతా వర్క్ చేసినట్లు తెలిపారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613